క్లుప్తంగా

వృద్ధులకు దుస్తుల పంపిణీ



ముచ్చింతాల (పెనుగంచిప్రోలు): గ్రామానికి చెందిన కొలగాని బాలస్వామి, దేవకరుణమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు ఫాదర్ కొలగాని మరియన్న, కొలగాని యోబు, ఫాదర్ జైపాల్ రాయలు శుక్రవారం వృద్ధులకు 60 మందికి నూతన వస్త్రాలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జక్కులూరి రాంబాబు, ఆర్‌సీఎం చర్చి విచారణ ఫాదర్ దేవకుమార్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



కంచికచర్ల: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభించి పేద వర్గాలను అణచివేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట కళ్యాణ్ అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం చలో ఢిల్లీ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 5వ తేదీన ఢిల్లీలో నిరసన ప్రదర్శన జరుగుతుందన్నారు. జయప్రదం చేయాలని కోరారు. సీఐటీయూ నాయకులు బెజ్జం భూషణం, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు గోపీనాయక్, జావేద్, బాషా కార్మికులు పాల్గొన్నారు.


నేడు ఆలయ భూముల కౌలు హక్కుల వేలం

భీమవరం (వత్సవాయి): స్థానిక కాశీవిశ్వేశ్వర స్వామి వారి ఆలయ వ్యవసాయ భూములకు కౌలువేలం శనివారం నిర్వహించనున్నట్లు ఈవో సీహెచ్ హరిదుర్గానాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే నంబర్ 505 లో 9.46 సెంట్ల భూమికి ఒక సంవత్సరానికి వేలం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా రూ.10,000 డిపాజిట్ చెల్లించాలని తెలిపారు. ఉదయం 11 గంటలకు దేవాలయ ప్రాంగణంలో పాట ప్రారంభమవుతుందని చెప్పారు గతంలో దేవదాయ శాఖకు బకాయిలు ఉన్న వారు ఈ వేలంలో పాల్గొనుటకు అనర్హులని సూచించారు.

భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వే

వీరులపాడు: భూ సమస్యలను పరిష్కరించేందుకే వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకాన్ని ప్రభుత్వం చేపట్టిందని తహసీల్దార్ ఆశయ్య నాయక్ పేర్కొన్నారు. మండలంలోని పల్లంపల్లి, రంగాపురం, వీరులపాడు, వీఅన్నవరం, దొడ్డదేవరపాడు, గ్రామాలలో చేపట్టిన భూముల రీ సర్వేను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల రీ సర్వేను నిష్పక్షపాతంగా చేపట్టాలన్నారు. ముఖ్యంగా రైతులకు ఏ ఇబ్బందులు కలగకుండా సర్వే నిర్వహించాలని ఆయన సూచించారు. రైతులు కూడా సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ నువ్వుల విశ్వనాథం, సర్పంచ్‌లు చెండ్యాల రామకృష్ణ, జమ్ముల వరబాబు, కన్నమాల సురేష్, ఎంపీటీసీ సభ్యుడు తోట నారాయణరావు, డెప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శివప్రసాద్, పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వీధులను శుభ్రం చేసిన విద్యార్థులు



బండిపాలెం(జగ్గయ్యపేట): గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చేపట్టిన సేవా కార్యక్రమం శుక్రవారం కూడా కొనసాగింది. దీనిలో భాగంగా విద్యార్థులు గ్రామంలో పలు వీధులను శుభ్రం చేశారు. రైతు భరోసా కేంద్రం, పశు సంవర్థక కార్యాలయం వద్ద పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం నిర్వాహకుడు మురళీధర్, కేవీకె శాస్త్రవేత్త వెంకట రెడ్డి, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిగామ: పట్టణంలోని చందర్లపాడు రహదారిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ దిబ్బయ్య శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12:30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పట్టణంలోని ముక్కపాటి కాలనీ, రైతుపేట డౌన్, ఆదర్శనగర్ లతోపాటు మండలంలోని చందాపురం, కేత వీరునిపాడు, ఐతవరం, అంబారుపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెనుగంచిప్రోలు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పూర్ణచంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అభివృద్ధి పనులు శరవేగం

- నందిగామ నగర పంచాయతీ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్
- కేక్ కట్ చేసి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అవటం అభినందనీయం



కౌన్సిల్ సభ్యులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: నగర పంచాయతీగా ఉన్న నందిగామ సెకండ్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అవటం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిన సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సభ్యులతో శుక్రవారం రాత్రి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి నందిగామ పట్టణ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అవడం వల్ల నిధుల రాబడిశాతం పెరుగుతుందని, ఉద్యోగాలు పెరుగుతాయని, అభివృద్ధి వేగం పుంజుకుంటుందన్నారు. గత ప్రభుత్వాల హయాంలో నందిగామ పట్టణం ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదని తాము అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో 30 ఏళ్లుగా చేయని అభివృద్ధిని చేసి చూపుతున్నామన్నారు. ప్రజలకు కనీస వసతులు కల్పించటంతో పాటు ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వ, సొంత, సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే పట్టణంలో సుమారు రూ.11 కోట్లకు పైగా నిధులు వెచ్చించి డ్రెయిన్లు నిర్మించినట్లు చెప్పారు.

20 నుంచి 25 శాతం అధిక నిధులకు అవకాశం..

నగర పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అవటం వల్ల ప్రభుత్వం నుంచి 20–25 శాతం మేర అధికంగా నిధులు మంజూరవుతాయని జగన్‌మోహనరావు తెలిపారు. ఉద్యోగావకాశాలు కూడా మెరుగుపడతాయన్నారు. ఈ సమావేశంలో నగర పంచాయతీ చైర్ పర్సన్ మండవ వరలక్ష్మి, వైస్ చైర్ పర్సన్లు మాడుగుల నాగరత్నం, ఓర్సు లక్ష్మి, కమిషనర్ డాక్టర్ జయరామ్, ఏఈ ఫణిశ్రీనివాస్, కౌన్సిల్ సభ్యులు పాకాలపాటి కిరణ్, తానూరి రాము, షేక్ ఖాలిక్, యాకుబ్ వలీ, గద్దె శేషుకుమారి, బాపట్ల సాంబయ్య, బండారు గంగమ్మ, మందా మరియమ్మ, కోఆప్షన్ సభ్యుడు దాసు, పలువురు కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ఉదయభానును కలిసిన మున్సిపల్ కమిషనర్



ప్రభుత్వ విప్ ఉదయభానుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చిన చందవోలు మల్లేశ్వరరావు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానును మర్యాదపూర్వకంగా కలిశారు. జగ్గయ్యపేట పురపాలక సంఘ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని శుక్రవారం విజయవాడలోని ఉదయభాను కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పేట మున్సిపల్ కమిషనర్‌గా పట్టణ అభివృద్ధికి సంబంధించి ఎటువంటి వివాదాలు, సమస్యలకు తావులేని విధంగా మంచి వాతావరణం ఉండేలా చూడాలని మల్లేశ్వరరావుకు ఉదయభాను సూచించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో సామినేని, తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని పురాతన శ్రీసీతారామస్వామి వారి (పెద్ద రామాలయం) దేవాలయం పునర్నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఉదయం 9.54 లకు జరిగిన నూతన దేవాలయం శంకుస్థాపన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, కౌన్సిలర్లు నూకల సాంబ, తన్నీరు నాగేంద్ర, పట్టణ సచివాలయ కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, పార్టీ నాయకులు ఫిరోజ్‌ఖాన్, కొత్తా పురుషోత్తం, పెద్ద శివాలయం చైర్మన్ గెల్లాపూర్ణ, దేవాలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్ తుమ్మేపల్లి వెంకటేశ్వరరావు, ఈవో కె.నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వారం రోజుల్లో ఎర్రకాలువ పనులు పూర్తి

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



ఎర్రకాలువ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో జరుగుతున్న ఎర్రకాలువ ప్రక్షాళన పనులను వారం రోజుల్లో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. శుక్రవారం ఎర్రకాలువ పనులను ఆయన పర్యవేక్షించారు. ఎర్రకాలువ ఊరు మొదలు కొని ఊరి చివరి వరకు పట్టణానికి నడిబొడ్డున ఉండి పలు వార్డుల మీదుగా ప్రవహిస్తుందని, చెత్త, వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగునీటి ప్రవాహం నిలిచిపోవడంతో దుర్వాసన, దోమలతో స్థానికులు ఇబ్బందులు పడుతూ ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. దీంతో ఎర్రకాలువ ప్రక్షాళన పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ పనుల్లో అశ్రద్ధ వహిస్తే సహించేది లేదని శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బందిని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కాశీ కిశోర్, పూసల పుల్లారావు, చిరంజీవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): దుకాణం దగ్గర సరుకులు తీసుకువస్తానని చెప్పి బయటకు వెళ్లిన తమ కుమార్తె కనిపించడం లేదంటూ ఓ తండ్రి అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగ్‌నగర్ లెనిన్‌సెంటర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె (23) పదో తరగతి వరకూ చదువుకొని, కొన్నేళ్ల నుంచి ఇంటి వద్దే ఉంటుంది. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో సమీపంలోని దుకాణంలో సబ్బులు కొనుక్కొని వస్తానని చెప్పి బయటకు వెళ్లింది. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల ఇంటి వద్ద విచారణ చేసినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పంట నష్టంపై కొనసాగుతున్న సర్వే



నందిగామ: మండలంలో ఈదురు గాలుల కారణంగా దెబ్బతిన్న పంట పొలాల్లో నష్టం వివరాల సేకరణ కార్యక్రమం కొనసాగుతోంది. శుక్రవారం మండలంలోని సోమవారం, రుద్రవరం, గొల్లమూడి గ్రామాల పరిసర ప్రాంతాల్లో ఈదురుగాలులకు దెబ్బతిన్న పంట పొలాలను ఏవో కాసిం పరిశీలించారు. మండలంలో పూర్తిస్థాయిలో పంట పొలాలు పరిశీలించిన తర్వాత నష్టం వివరాల అంచనా తెలుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు



నందిగామ: వాహన చోదకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎస్‌హెచ్‌ఓ సతీష్ పేర్కొన్నారు. పట్టణంలో శుక్రవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్ లేకుండా, వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకుండా, అతి వేగంగా వెళుతున్న, ట్రిపుల్ రైడ్ చేస్తున్న, మైనర్లు నడుపుతున్న పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా లైసెన్స్ తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను దగ్గర ఉంచుకోవాలన్నారు. హెల్మెట్ ధరించాలన్నారు. ఈ తనిఖీలలో సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక

నందిగామ: పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు నలుగురు ప్రాంగణ నియామకాల్లో ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో టీవీఎస్ సంస్థకు చెందిన వీల్స్ ఇండియా సంస్థ ప్రాంగణ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ నియామకాలకు హాజరైన పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఈసీఈ విభాగంలో మూడో సంవత్సర విద్యార్థినులు సత్యవతి, తేజశ్రీ, రేష్మ, జ్యోతిర్మయిలకు నియామక పత్రాలు అందజేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



నందిగామ పట్టణంలో టీబీ డే ర్యాలీ



ర్యాలీలో ప్రభుత్వాస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది



పోషకాహార కిట్లు అందజేస్తున్న ఎంపీపీ

నందిగామ: ప్రమాదకరమైన క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి, అప్రమత్తతో ఉండాలని గొల్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుడు డాక్టర్ రవి సూచించారు. వరల్డ్ టీబీ డే సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నందిగామ పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ అవసరమైన ముందు జాగ్రత్తలు తీసుకున్న తరుణంలో ఈ వ్యాధి దరి చేరదన్నారు. ప్రస్తుతం చాప కింద నీరులా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతోందని, ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం అనుమానం కలిగినా, వెంటనే ప్రభుత్వాస్పత్రిలో పరీక్ష చేయించుకోవాలన్నారు. ఆగకుండా దగ్గు రావడం, ఛాతిలో నొప్పి, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, తరచూ జ్వరం వస్తుండటం తదితర లక్షణాలున్న వారు ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు జగదీష్ బాబు, విద్యాసాగర్, సత్యనారాయణ, రమ్య, ధీరజ్ కుమార్, టీబీ యూనిట్ సూపర్వైజర్ నాగేశ్వరరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో అవగాహనకార్యక్రమాలునిర్వహించారు.ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్ మాట్లాడుతూ టీబీ వ్యాధి పట్ల ఎవరూ బయపడాల్సిన అవసరం లేదని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పోషకాహారం, నియమితమైన కోర్సుతో మందులు వాడటం ద్వారా టీబీ వ్యాధిని జయించవచ్చన్నారు. పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగరాణి మాట్లాడుతూ టీబీ రోగులకు ప్రభుత్వం పోషకాహార పాకెట్లు అందజేయడంతో పాటు ప్రతి నెల వారి ఎకౌంట్‌లో రూ.500 జమ చేస్తోందన్నారు. అనంతరం ప్రతి నెల ఐదుగురు క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహారాన్ని అందజేస్తున్న కర్లపాటి ట్రస్ట్ వ్యవస్థాపకులు కర్లపాటి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. టీబీ దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ వైద్య నిపుణులు డాక్టర్ పవన్, డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ శాలిని, టీబీ సూపర్‌వైజర్ నాగరాజు, ఆశాలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వీరులపాడు: మండలంలోని అల్లూరు, పెద్దాపురం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో కలిసి శుక్రవారం క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైద్యాధికారి గౌతమ్, సర్పంచ్‌లు బందెల రాణి, నిప్పులపల్లి శాంతమ్మ, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం, మాజీ సర్పంచ్ కోటేరు సూర్యనారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఆవుల ప్రసాద్, ఉప సర్పంచ్ బెల్లంకొండ నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు మొండ్రు బాయమ్మ, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: చందర్లపాడు ఎస్సీ కాలనీలో వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనం చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు స్వామి వారి శేష వస్త్రంతో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు యార్లగడ్డ సత్యనారాయణ ప్రసాద్, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న సామినేని, రంగాపురం తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నివాసంలో జరిగిన కార్యక్రమంలో తొర్రగుంటపాలెంకు చెందిన పెంటేల ప్రమీలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.1.30 లక్షల చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనేత సామినేని వెంకటకృష్ణప్రసాద్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, నాయకులు పూసాల పుల్లారావు, కాశి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనుల పరిశీలన



రహదారిలో విస్తరణ పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ జయరామ్

నందిగామ: పట్టణంలో ప్రధాన రహదారుల విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరామ్ పేర్కొన్నారు. పట్టణంలోని రామన్నపేట రోడ్డులో జరుగుతున్న విస్తరణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని ప్రధాన రహదారులు అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే పలు రహదారులలో విస్తరణ పనులు కొనసాగుతున్నాయన్నారు. ఆయా రహదారులలో ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ బాలసైదా

గౌరవరం(జగ్గయ్యపేట): డ్వాక్రా మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ చైర్మన్ సయ్యద్ బాలసైదా పేర్కొన్నారు. గ్రామ సచివాలయంలో మూడో విడత వైఎస్సార్ ఆసరా ప్రారంభ నేపథ్యంలో శుక్రవారం డ్వాక్రా మహిళలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సభ్యులు సమైక్యంగా ఉండి రుణాలను తీసుకోవాలన్నారు. ముఖ్యంగా బ్యాంకులు, సొసైటీలలో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్యామల, ఏపీఎం వెంకటేశ్వరరావు, గ్రామ నాయకులు శ్రీనివాసరెడ్డి, అలివేలుమంగ మల్లేశ్వరరావు, వార్డు కార్యదర్శి మంగమ్మ, వీఏవోలు సుజాత, అపర్ణ, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

దాస్ కా దమ్కీ చిత్రం విజయం ఆనందంగా ఉంది



మాట్లాడుతున్న నటులు, దర్శకులు విశ్వక్ సేన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దాస్‌కా దమ్కీ చిత్రం మంచి విజయం సాధించడం చాలా ఆనందంగా ఉందని, అంతకంటే ముఖ్యంగా మంచి సినిమాను ప్రేక్షకులకు అందించానని సంతృప్తిగా ఉందని నటుడు, దర్శకుడు విశ్వక్ సేన్ అన్నారు. దాస్ కా ధమ్కీ చిత్రం విజయాత్రలో భాగంగా శుక్రవారం నగరంలోని జయరాం థియేటర్‌లో ప్రేక్షకులతో కలసి కొద్ది సేపు సినిమాను వీక్షించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉగాది పండుగ సందర్భంగా సినిమాను విడుదల చేశామన్నారు. మంచి ఓపెనింగ్స్ వచ్చాయని, సినిమా చూసిన ప్రతి ఒక్కరూ బాగుందని అంటున్నారని అది చాలా ఆనందంగా ఉందన్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ డిస్ట్రిబ్యూటర్ అసిస్టెంట్ మేనేజర్ పి. పవన్ కుమార్ విష్వక్సేనుకు పుష్పగుచ్ఛం అందచేసి స్వాగతించారు. జయరాం థియేటర్ మేనేజర్ కె. రాజ్ కుమార్ మాట్లాడుతూ మొదటి రోజు నుంచి మంచి ఓపెనింగ్స్ ఉన్నాయని, పరీక్షలు అయిపోగానే మంచి కలెక్షన్స్ రాబడుతుందన్నారు. అన్నపూర్ణ డిస్ట్రిబ్యూటర్స్ పి.వసంత కుమార్, పి.పవన్ కుమార్, జయరామ్ థియేటర్ బాధ్యులు వి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

జగ్గయ్యపేట అర్బన్ : పేట మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర శుక్రవారం తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో ఉదయం 11 గంటలకు జరుగు ఈ సమావేశంలో పట్టణంలోని పలు అభివృద్ధి పనులు, పరిపాలనకు సంబంధించిన కేటాయింపులు తదితర 8 అంశాలతో కూడిన ఎజెండాను కౌన్సిల్ సభ్యుల ఆమోదం కోసం సిద్ధం చేసినట్లు తెలిపారు. కౌన్సిల్ సభ్యులు, ఎక్స్–అఫీషియో సభ్యులు హాజరు కావాలని కోరారు.

తెలుగు గంగ పదబంధ పరిమళాలు గ్రంథావిష్కరణ

విజయవాడ కల్చరల్:నగరానికి చెందిన ప్రముఖ రచయిత, పరిశోధకుడు డాక్టర్ జీవీ పూర్ణచందు రచించిన తెలుగు గంగ పదబంధ పరిమళాలు గ్రంథాన్ని కాశీలోని బెనారస్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఉగాది పర్వదినం సందర్భంగా ఆవిష్కరించామని రచయిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు వారికి గంగానదికి విడదీయలేని అనుబంధం ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో తెలుగు గంగ పదబంధ పరిమళాలు పరిశోధక గ్రంథం రచన సాగిందన్నారు. ఆవిష్కరణ కార్యక్రమంలో కేంద్ర సమాచారహక్కు మాజీ కమిషనర్ ఆచార్య మాడభూషి శ్రీధర్, బెనారస్ యూనివర్సిటీ తెలుగు విభాగం ఆచార్యులు బూదాటి వెంకటేశ్వర్లు, తెలుగు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోరాటాల ఫలితమే కమిటీ ఏర్పాటు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): నూతన పెన్షన్ విధానంపై కేంద్ర ప్రభుత్వం పునఃసమీక్షించడానికి ఫైనాన్స్ సెక్రటరీ అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేయడం ఆలిండియా రైల్వేమెన్ ఫెడరేషన్, దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్‌లు సాగిస్తున్న పోరాటాల ఫలితమే అని మజ్దూర్ యూనియన్ విజయవాడ డివిజనల్ సెక్రటరీ జీఎస్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవీ విరమణ చేసిన వారికి ఎలాంటి గ్యారంటీ పెన్షన్ లేక పోవటంతో వారు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. దీనిపై ఆలిండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్‌లు నూతన పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా, పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం పోరాట మార్గం పట్టాయని పేర్కొన్నారు.